ఈనాడు
తమిళనాడు
సోమవారం అక్టోబరు 7, 2024

మెరినాలో పండుగ వాతావరణం | జనాలతో కిక్కిరిసిన తీరం

ఎయిర్ షో.. అదరహో

చెన్నై నగరంలోని మెరినా సముద్రతీరం ఆదివారం జనసందోహంతో నిండిపోయింది. మండుతున్న ఎండను సైతం లెక్క చేయకుండా కొందరు, గొడుగులు పట్టుకుని మరికొందరు ఆకాశంవైపు తలలెత్తి గగనతలంలో వైమానిక విన్యాసాలను ఎంతో ఆసక్తిగా తిలకించారు. చప్పట్లు చరుస్తూ, కేరింతలతో ఆనందోత్సాహాలు వ్యక్తం చేయడంతో పోటెత్తుతున్న సముద్రపు అలల ఘోష చిన్నబోయింది.



సైనికుల పారాచూట్ విన్యాసాలు





విన్యాసాలు తిలకిస్తున్న చీఫ్ ఎయిర్ మార్షల్, ముఖ్యమంత్రి స్టాలిన్ దంపతులు, దురైమురుగన్, ఉదయనిధి, దయానిధిమారన్ తదితరులు

చెన్నై, న్యూస్‌టుడే: భారత వైమానిక దళ 92వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఎయిర్ షోను తిలకించడానికి ఉదయం 7 గంటల నుంచే ప్రజలు మెరినా తీరానికి రావడం మొదలుపెట్టారు. ఉదయం 10 గంటలకంతా తీరం జనంతో నిండిపోయింది. 11 గంటలకు ఎయిర్ షో ప్రారంభం కావడంతో పిల్లల నుంచి పెద్దల వరకు అంతా ఆసక్తితో తిలకించారు. చప్పట్లు చరుస్తూ, అరుస్తూ హర్షం వ్యక్తం చేశారు. సెల్‌ఫోన్ కెమెరాలతో విన్యాసాలను చిత్రీకరించారు. విన్యాసాలు కనిపించేలా సెల్ఫీలు తీసుకున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో నగరవాసులే కాకుండా పొరుగు జిల్లాల నుంచి కూడా మెరినాకు తరలివచ్చారు. పలువురు పిల్లలతో కలిసి కుటుంబ సమేతంగా వచ్చారు.

వీక్షించిన ముఖ్యమంత్రి దంపతులు

ఎయిర్ షోను ప్రత్యక్షంగా తిలకించడానికి ముఖ్యమంత్రి స్టాలిన్ తన సతీమణి దుర్గతో కలిసి బీచ్ ప్రాంతానికి విచ్చేశారు. ప్రభుత్వ, భారత వైమానిక దళం ప్రముఖుల కోసం ఏర్పాటు చేసిన పందిరితో కూడిన వేదిక నుంచి వైమానిక విన్యాసాలను తిలకించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో స్టాలిన్ చలువ కళ్లద్దాలు ధరించారు. ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు, చీఫ్ ఎయిర్ మార్షల్ ఏపీ సింగ్, వైమానిక దళం అధికారులు తదితరులు వేదిక నుంచి తిలకించారు. ముఖ్యమంత్రి తన 'ఎక్స్' పేజీలో... ఆకాశంలో మన సూపర్‌స్టార్లైన ఐఏఎఫ్ హీరోలు చేసిన అద్భుతమైన ప్రదర్శనను చెన్నై ఆస్వాదించిందని, కృతజ్ఞతలని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి తన 'ఎక్స్' పేజీలో... మెరీనాలో ప్రకాశవంతమైన నీలాకాశంలో భారత వైమానిక దళం ఆకట్టుకునే వైమానిక విన్యాసాల దృశ్యాలను ముఖ్యమంత్రితో కలిసి ఆస్వాదించే అవకాశం తమకు లభించిందని తెలిపారు. ఊపిరి బిగబట్టించిన గగనతల దృశ్యాలు, స్పష్టమైన ఆకాశవైశాల్యం తమను ఆశ్చర్యంలో ముంచెత్తాయని పేర్కొన్నారు. ఇంతటి నైపుణ్యాన్ని దగ్గర నుంచి చూడటం ఆశ్చర్యంగా ఉందన్నారు. మర్చిపోలేని విధంగా మార్చిన నిర్వాహకులు, కళాకారులకు హృదయపూర్వక శుభాకాంక్షలని తెలిపారు. విలేకర్లతో చీఫ్ ఎయిర్ మార్షల్ ఏపీ సింగ్ మాట్లాడుతూ... రంగులమయమైన ఈ వైమానిక విన్యాసాలను సుమారు 15 లక్షల మంది తిలకించారని తెలిపారు.

■ తాంబరం ఎయిర్స్ ఫోర్స్ గ్రూప్ కెప్టెన్ నక్కీరన్ భరనన్ విలేకర్లతో మాట్లాడుతూ... రాష్ట్రంలోని పలువురు ఇలాంటి ఎయిర్ షోను గతంలో తిలకించి ఉండరన్నారు. ఇది వైమానిక దళంలో పనిచేసేందుకు పలువురికి ప్రేరణ కలిగిస్తుందని, రాష్ట్రం నుంచి వైమానిక దళంలో చేరే వారి సంఖ్యను మరింత పెంచుతుందని తెలిపారు.

21 ఏళ్ల తర్వాత..

వడపళని: రఫేల్ వంటి జెట్ విమానాలతో కలిపి మొత్తం 72 రకాల విమానాలు విన్యాసాల్లో పాల్గొన్నాయి. లైట్ కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు తేజస్, ప్రచండ్, డకోటా, హార్వర్డ్ వంటి హెరిటేజ్ విమానాలు పాలు పంచుకున్నాయి. సూర్యకిరణ్ ఏరోబ్యాటిక్ బృందం, సారంగ్ హెలికాప్టర్ ఏరోబ్యాటిక్ బృందం ప్రదర్శనలు అందరినీ ఆకర్షించాయి. లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్సులో స్థానం సంపాదించుకోవాలనే దిశగా ఐఏఎఫ్ ప్రణాళికలు చేసిందని ఐఏఎఫ్ డే పరేడ్ చీఫ్ కోఆర్డినేటింగ్ ఆఫీసర్, ఎయిర్ వైస్ మార్షల్ కె.ప్రేమ్ కుమార్ పేర్కొన్నారు. 21 ఏళ్ల విరామానంతరం చెన్నైలో ఎయిర్ షో జరిగిందని, దేశ రాజధానిలో కాకుండా ఇలా నిర్వహించడం మూడోసారని ఆయన అన్నారు. చివరిగా 2023 అక్టోబరు 8వ తేదీ ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగరాజ్ సంగం ప్రాంతంలో నిర్వహించగా, అంతకు ముందు ఏడాది చండీఘర్‌లో జరిగాయని తెలిపారు. శుక్రవారం తాంబరం ఐఏఎఫ్‌తో కలిసి పూర్తి స్థాయిలో పూర్వాభినయాన్ని నిర్వహించినట్లు వివరించారు.



తీరంలో జనసందోహం

పలు చోట్ల ట్రాఫిక్ అంతరాయం

ప్యారిస్: ఎయిర్ షోను తిలకించేందుకు మెరినా తీరానికి లక్షలాది మంది తరలి వచ్చారు. ఎండతీవ్రత, జనరద్దీలో చిక్కుకుని పలువురు స్పృహకోల్పోయారు. పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. మెరినాకు బస్సులు, రైళ్ల ద్వారా వస్తుండటంతో రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు కిక్కిరిశాయి. కార్యక్రమం ముగిసిన తర్వాత ప్రజలు తమ ప్రాంతాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బంది పడ్డారు. సాధారణంగా కానుం పొంగల్ సమయంలో మెరినాలో కనిపించే రద్దీ ఎయిర్ షో సందర్భంగా కనిపించింది. జనాలకు తగ్గట్టు రైళ్లు నడపలేదని కొందరు ఆరోపించారు. అరగంటకు ఓ రైలు నడుస్తుండటంతో వేళచ్చేరి, చింతాద్రిపేట మొదలైన రైల్వేస్టేషన్లలో రైళ్ల కోసం పడిగాపులు కాచారు. వేళచ్చేరి రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫాంపై నిలబడేందుకు కూడా స్థలం లేకపోవడం గమనార్హం. కొందరు రైళ్లు ఆలస్యం కావడంతో పట్టాలపై నడుచుకుంటూ వెళ్లారు.

జనంతో నిండిన డాబాలు

విన్యాసాలు జరుగుతున్న ప్రాంతం నుంచి పది కి.మీ పరిధి వరకు ప్రజలు తమ ఇళ్ల డాబాలపై ఎక్కి తిలకించారు. మెరీనా బీచ్ వైపునకు వెళ్లే మెట్రో, సబర్బన్ సర్వీసులు తగ్గాయి. చెన్నై బీచ్ సబర్బన్ స్టేషను నుంచి అనేక మంది వీక్షించారు. మెరీనాలో జనరద్దీ చూసి భయం వేసి తమ ఇంటి డాబాలపై నుంచి తిలకించి సంతృప్తి చెందినట్టు పలువురు నగరవాసులు తెలిపారు. బీచ్‌కు పది కిలోమీటర్ల పరిధిలో ఉన్న అన్ని ఇళ్ల డాబాలపై జనాలే కనిపించారు. ఎండ కావడంతో గొడుగులు పట్టుకుని మరీ తిలకించారు. కొన్ని సందర్భాలలో విమానాలు తక్కువ ఎత్తులో వెళ్తుండటంతో ఆనందంతో కేరింతలు కొట్టారు. విన్యాసాలు యూట్యూబ్, డీడీ ఛానెళ్లలో కూడా ప్రత్యక్ష ప్రసారమయ్యాయి.



పొగలు కక్కుతూ హెలికాప్టర్ల విన్యాసాలు

కోవళం వరకు..

ఎయిర్ షోను మెరినా నుంచి కోవళం వరకు సముద్ర తీరప్రాంతంలో చూసి ఆనందించవచ్చని వైమానిక దళం అధికారులు ముందే ప్రకటించారు. దీంతో మైలాపూర్, శాంథోం, తిరువల్లికేణి, చేపాక్కం, అడయారు, తిరువాన్మియూర్, బెసెంట్ నగర్, కొట్టివాక్కం, నీలాంకరై, పాలవాక్కం తదితర చోట్ల సముద్రతీరం వెంబడి ఉన్న ప్రాంతవాసులు ఇంటి మిద్దెలు, ఎత్తైన నిర్మాణాలపై నిలబడి గగనంలోని వైమానిక విన్యాసాలను ఆసక్తిగా తిలకించారు. మెరినా తీరంలో మాత్రం సుమారు 4 లక్షల మంది ఈ విన్యాసాలను తిలకించినట్లు అంచనా.



ఆకాశంలోకి దూసుకెళ్తూ..

నలుగురి మృతి?

ఎండ తీవ్రతకు మొత్తం 230 మంది స్పృహకోల్పోగా 30 మంది 93 మంది పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని సమాచారం. అందులో నలుగురు చికిత్స పొందుతూ మరణించి నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం అధికారికంగా ప్రకటించలేదు.



ఎండ తీవ్రతకు గొడుగులు పట్టుకుని తిలకిస్తున్న జనాలు



మెరినా రోడ్డులో వాహనాల రద్దీ



ప్రసంగిస్తున్న గవర్నర్ ఆర్‌ఎన్ రవి

మత్తుపదార్థాల నియంత్రణపై పోలీసులు శ్రద్ధ వహించాలి

గవర్నర్ ఆర్‌ఎన్ రవి

ప్యారిస్, న్యూస్‌టుడే: మత్తుపదార్థాల నియంత్రణకు పోలీసులు అధిక శ్రద్ధ వహించాలని రాష్ట్ర గవర్నర్ ఆర్‌ఎన్ రవి తెలిపారు. వాయిస్ ఆఫ్ తెన్‌కాశి ఫౌండేషన్, రోటరీ క్లబ్ ఆఫ్ రాజపాళెయం కింగ్స్ సిటీ, ఎన్జీవోల తరఫున తెన్‌కాశి జిల్లా శంకరన్‌కోవిల్‌లో ఆదివారం మత్తుపదార్థాల నియంత్రణ ర్యాలీ, బహిరంగ సమావేశం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ మాట్లాడుతూ... నవరాత్రి వేడుకల సందర్భంగా ప్రతిరోజు సాయంత్రం రాజ్‌భవన్‌లో జరిగే పూజలో తాను పాల్గొంటానని, అయినా మత్తుపదార్థాల నియంత్రణపై అవగాహన కార్యక్రమం కావడంతో తాను పాల్గొనడానికి అంగీకరించినట్లు తెలిపారు. మత్తుపదార్థాల వాడకంతో కుటుంబాలు, సమాజం ప్రభావితం అవుతున్నాయన్నారు. యువత, విద్యార్థులు అధికంగా ఉపయోగిస్తున్నారన్నారు. దీంతో కొంతమంది నేరాలకు పాల్పడి భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు నియంత్రణకు అధిక శ్రద్ధ చూపాలన్నారు. పోలీసులు టన్నులకొద్దీ గంజాయి స్వాధీనం చేసుకుంటున్నట్లు వార్తలు వస్తున్నాయన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో మత్తుపదార్థాల నియంత్రణపై అవగాహన కల్పించాలని తెలిపారు. పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు పర్యవేక్షించాలని, వారి కోసం ప్రతిరోజు కొంత సమయాన్ని కేటాయించాలని సూచించారు. డ్రగ్స్ నియంత్రణకు ప్రతిఒక్కరూ కృషి చేసి కుటుంబం, సమాజం, దేశాన్ని రక్షించాలని పిలుపునిచ్చారు.

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై ఫిర్యాదు

ప్యారిస్, న్యూస్‌టుడే: మత కల్లోలాలు సృష్టించేలా మాట్లాడారని ఆరోపిస్తూ ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై మదురై పోలీసు కమిషనరు కార్యాలయంలో ఓ న్యాయవాది ఈనెల 4న ఫిర్యాదు చేశారు. సనాతన ధర్మం గురించి ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ గతంలో చేసిన వ్యాఖ్యలను ఇటీవల ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పరోక్షంగా విమర్శించారు. ఈ క్రమంలో మైనారిటీ ప్రజలు, తమిళనాడు ఉప ముఖ్యమంత్రి గురించి, సామాజిక ఉద్రిక్తతలు నెలకొనేలా మాట్లాడిన పవన్ కల్యాణ్‌పై చర్యలు చేపట్టాలని కోరుతూ న్యాయవాది వాంజినాథన్ మదురై కమిషనరు కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... తిరుపతిలో జరిగిన బహిరంగ కార్యక్రమంలో ఆంధ్రా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడిన మాటలు తమని దిగ్భ్రాంతికి గురిచేశాయని తెలిపారు. ముస్లిం, క్రైస్తవులు మొదలైన మైనారిటీ ప్రజలే లక్ష్యంగా విద్వేషాలను రెచ్చగొట్టేలా ఆయన మాట్లాడారన్నారు. ఇందుకు సంబంధించి వెలువడిన వార్తల ప్రాతిపదికన ఆయనపై తగిన చర్యలు చేపట్టాలని ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఏసుక్రీస్తు, అల్లా గురించి తప్పుగా మాట్లాడితే దేశాన్ని తగల బెడుతున్నారని, అలా హిందువులు ఎందుకు చేయకూడదని ఆయన వ్యాఖ్యానించినట్లు తెలిపారు. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ ప్రజల మధ్య విద్వేషాలు, పగను ప్రేరేపించేలా ఆయన మాటలు ఉన్నాయన్నారు. ప్రజలంతా మత సామరస్యంతో జీవించాలనేది రాజ్యాంగం ఉద్దేశం అన్నారు. దానికి విరుద్ధంగా హిందువులు, ముస్లింలు, క్రైస్తవుల మధ్య మత కల్లోలాలను సృష్టించేలా పవన్ కల్యాణ్ మాట్లాడారని దుయ్యబట్టారు. కావున ఆయనపై తగిన చర్యలు చేపట్టాలని కోరినట్లు తెలిపారు. తిరుమల లడ్డూ వ్యవహారంలో ముస్లిం, క్రైస్తవులకు సంబంధం లేదని, నెయ్యి సరఫరాకు ఒప్పందం కుదుర్చుకున్న సంస్థలన్నీ హిందువులకు సంబంధించినవే అన్నారు. దానిపై పర్యవేక్షణ హిందూ అధికారిదేనని, ఆలయ వంటశాలలో ఉండేదీ సనాతన బ్రాహ్మణులేనన్నారు. కావున కల్తీ నెయ్యిని గుర్తించే బాధ్యత వారికి ఉందన్నారు. వారి గురించి ఎందుకు మాట్లాడటం లేదన్నారు. ఏడాదిన్నర క్రితం ఉదయనిధి స్టాలిన్ సనాతధర్మం గురించి మాట్లాడారని, ప్రస్తుతం పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు ఉదయనిధిని మాత్రమే కాకుండా తమిళనాడు ప్రజలను, అంబేడ్కర్‌ని కించపరిచేలా ఉన్నాయని ఆరోపించారు.

ఎడప్పాడి పళనిసామి కృతజ్ఞతలు

టీనగర్: అన్నాడీఎంకే 53వ ఆవిర్భావ దినోత్సవం జరుపుకోనున్న నేపథ్యంలో ఆ పార్టీ అభిమానులకు అభినందనలు తెలిపిన ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిసామి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన ఆదివారం 'ఎక్స్' వేదికగా విడుదల చేసిన ప్రకటనలో.. పార్టీ వ్యవస్థాపకుడు ఎంజీఆర్ నేతృత్వంలో పార్టీ ప్రారంభమై జయలలిత హయాంలో అభివృద్ధి మార్గంలో నడిచిందని, ప్రస్తుతం తన సారథ్యంలో వారి ఆశయాలతో ముందుకు నడిపిస్తున్నట్లు తెలిపారు. పార్టీ 53వ ఆవిర్భావ దినోత్సవాలు ఈ నెల 17న ప్రారంభంకానున్న నేపథ్యంలో పవన్ కల్యాణ్ ట్వీట్‌పై స్పందించారు. ఆయనకు తన వంతుగా కృతజ్ఞతలు చెప్పుకుంటున్నట్లు పేర్కొన్నారు. తిరుమల లడ్డూ వ్యవహారంలో డీఎంకే నేతల తీరును తప్పుబట్టిన ఆయన తాజాగా అన్నాడీఎంకే వర్గీయులకు అభినందనలు తెలుపుతూ చేసిన ట్వీట్ తమిళనాడులో చర్చకు దారితీసింది.

అందరూ యోగాభ్యాసం చేయాలి




పుస్తకావిష్కరణలో అతిథులు

ప్యారిస్: ధ్యాన గురు వేణుగోపాల్ తమిళంలో రచించిన 'గురువుడన్ ధాన్యంగళ్' అనే పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం మైలాపూర్‌లోని భారతీయ విద్యా భవన్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేష్‌కుమార్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఆది గురువైన పతాంజలి ప్రారంభించిన యోగాభ్యాసాన్ని అలవరచుకొని సమాజంలోని అనేకమందికి యోగా, ధ్యాన కళను అందించి దైనందిన జీవితంలో వారిని ఒత్తిడి నుంచి విముక్తి చేస్తున్న జ్ఞాన గురు వేణుగోపాల్ కొనియాడదగినవారని అభినందించారు. ఈ కళను ప్రతి ఒక్కరూ నేర్చుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని తెలిపారు. మరో ముఖ్య అతిథి జస్టిస్ కృపాకరన్ మాట్లాడుతూ... తాను ప్రస్తుతం వేణుగోపాల్ వద్ద యోగాభ్యాసం నేర్చుకుంటున్నానని, అందరూ ఆదరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ పుస్తకం మొదటి ప్రతిని అందుకున్న ద్రావిడ దేశం అధ్యక్షులు కృష్ణారావు మాట్లాడుతూ.. వేణుగోపాల్ గారి కుటుంబంతో తనకు దాదాపు 35 సంవత్సరాలకు పైగా అనుబంధం ఉందని, సమాజానికి వారి కుటుంబం ఎంతో ఆదర్శప్రాయమైనదన్నారు. ఆదాయపన్నులశాఖ సహాయ కమిషనరు గీతాదేవి, ధ్యానగురు వేణుగోపాల్ సోదరీమణులైన ఆల్ ఇండియా రేడియో అధికారిణి డాక్టర్ లలిత, సరస్వతి పాల్గొన్నారు.

డీఎంకే నుంచి కార్పొరేటర్ సస్పెన్షన్

చెన్నై, న్యూస్‌టుడే: చెన్నై మహానగర కార్పొరేషన్ 144వ డివిజన్ కార్పొరేటర్ (డీఎంకే) ఎ.స్టాలిన్‌ను డీఎంకే నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు పార్టీ ప్రధానకార్యదర్శి దురైమురుగన్ ప్రకటించారు. పార్టీ నిబంధనలు అతిక్రమించి, పార్టీకి చెడ్డపేరు తీసుకొచ్చేలా వ్యవహరించడంతో పార్టీ ప్రాథమిక సభ్యత్వం సహా తదితర అన్ని పదవుల నుంచి తాత్కాలికంగా తొలగిస్తున్నట్టు తెలిపారు. మెట్రోవాటర్ బోర్డు అధికారులను బెదిరించినట్టు స్టాలిన్‌పై కేసు నమోదై విచారణ జరుగుతున్న నేపథ్యంలో పార్టీ నుంచి ఆయన్ను సస్పెండ్ చేయడం గమనార్హం.

విమర్శలకు తావైన వైగో మనవరాలి వివాహ ఆహ్వానపత్రిక



విల్లివాక్కం, న్యూస్‌టుడే: ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో ఇంటి వివాహమహోత్సవ ఆహ్వానపత్రిక సామాజిక మాధ్యమాల్లో ప్రస్తుతం వైరల వుతోంది. కులం, గోత్రం తదితరాలను సూచించి వైగో పేరుతో ముద్రించిన పత్రికను చూసిన వారు విమర్శలు గుప్పిస్తున్నారు. దురై వైగో కుమార్తె, వైగో మనవరాలి వివాహ ఆహ్వానపత్రిక పలువురికి షేర్ చేస్తున్నారు. పత్రిక వైష్ణవ శైలిలో ముద్రించారు. అంతేకాకుండా కులం, వంశం, గోత్రం, నక్షత్రం, రోజు, మంచి సమయం తదితరాలను సూచించారు. ద్రవిడ ఉద్యమానికి అగ్రగామిగా పేరొందిన వైగో మనవరాలి పెళ్లికి పత్రికను ఇలాఎలా ముద్రించారని పలువురు విమర్శిస్తున్నారు.

జలగండం.. ఎదుర్కొనేందుకు సన్నద్ధం

చెన్నైలో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతున్న అధికారులు | ముంపు ప్రాంతాల్లో రక్షణకు సర్వేలు | గత తప్పిదాలను సరిదిద్దుకునేలా వ్యూహాలు

ఈనెల మూడో వారం నుంచి చెన్నై నగరంలో వర్షాలు పడొచ్చని వాతావరణశాఖ హెచ్చరికలు చేస్తోంది. ఇవి ప్రభావం చూపే అవకాశముందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం, నగర యంత్రాంగం సంప్రదింపులు జరిపారు. ముంపు ప్రాంతాల్లోని ప్రజల రక్షణకు సత్వర చర్యలు చేపట్టేలా, వారికి రక్షణగా ముందస్తుగా సంసిద్ధమయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఈనాడు-చెన్నై

ఈసారి ప్రత్యేక పంథాతో ముందుకెళ్తున్నారు. వార్డుల వారీగా అత్యవసర సేవలు అందాల్సినవారి వివరాలను ముందే సేకరిస్తున్నారు. వరదల సమయంలో వారిని మరిచిపోకుండా గుర్తుపెట్టుకుని సహాయక చర్యలు అందించేలా చూస్తున్నారు. దివ్యాంగులు, పసిపిల్లలు, గర్భిణులు, వృద్ధుల వివరాల్నీ తయారుచేసి ప్రాంతాలవారీగా మ్యాపింగ్ చేస్తున్నారు. వచ్చేవారంలోపు ఈ ప్రక్రియను పూర్తిచేసేలా గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) చర్యలు తీసుకుంటోంది. మొత్తం నగరంలో ముంపు ప్రాంతాల్లోని 2లక్షల గృహాలు, 3,196 రోడ్లు, నదులు, చెరువులు, కెనాల్స్ పరిసర ప్రాంతాల్లో ఉండే గృహాల వివరాల్ని సేకరిస్తున్నారు. ఇందుకోసం ముంపు ప్రాంతాల్లో 1546 మంది వాలంటీర్లు పనిచేస్తున్నారు.



నగరానికి చేరిన బోట్లు

గతసారి లోపాలు

చెన్నైలో గతేడాది వరదల సమయంలో అనూహ్యంగా వరదనీరు పలు ప్రాంతాలను ముంచెత్తింది. చాలాచోట్ల విద్యుత్తు కోతలు తీవ్ర ఇబ్బందులకు గురిచేశాయి. కనీసం మొబైల్ నెట్‌వర్క్ సైతం సరిగా లేక నగరవాసులు నరకయాతన అనుభవించారు. తద్వారా నీటిమునక ప్రాంతాల గుర్తింపు ఆలస్యమైంది. బాధితులకు సరైన సమయంలో ఆహారం అందలేదు కూడా.

అనుభవజ్ఞుల దళం

చెన్నై నగరంలో భారీ వర్షాలు, వరద ముప్పు పరిస్థితుల్నీ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు ఇబ్బందిలేకుండా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అధికారుల బృందాన్ని నియమించింది. ఇందులో 15మంది సీనియర్ ఐఏఎస్ అధికారులున్నారు.

ఈసారి ఇలా..

గతసారి లోపాలు ఈసారి చోటుచేసుకోకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వం నుంచి యంత్రాంగానికి కీలక ఆదేశాలు వెళ్లాయి. నగరంలో ముంపువాసులకు ఆహారపొట్లాలు ఇచ్చేందుకు వాటి తయారీకి ఒకేచోట వంటలుచేసి తరలించడంకన్నా, ముంపు ప్రాంతాల్లో వేర్వేరుచోట్ల ఏర్పాట్లు చేయాలని చూస్తున్నారు. తద్వారా సకాలంలో ప్రజలకు అందించేందుకు ఆస్కారం ఉంటుందని అనుకుంటున్నారు. తాగు నీరు, పాలప్యాకెట్లు సైతం సులువుగా అందేలా ప్రత్యేక రవాణా వ్యవస్థను ఏర్పాటుచేయాలని చూస్తున్నారు.

మొదలైన సహాయక చర్యలు

■ వరదసాయం తక్షణమే అందేలా స్థానిక అధికారులతో పాటు ఎమ్మెల్యేలు, మంత్రులకు వైర్‌లెస్ ఫోన్లను అందిస్తున్నారు. స్థానిక ప్రాంతాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సహాయక చర్యలకోసం వెంటనే స్పందించేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

■ ఇప్పటికే వార్డులవారీగా ముంపునకు అవకాశమున్న ప్రాంతాల వివరాల్ని తయారుచేశారు. ఆయా ప్రాంతాల్లో ముందే సహాయక చర్యలకు అవసరమైనవి తీసుకెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నారు. మోటారు పంపులు, బోట్లు తరలిస్తున్నారు. ఇప్పటికే 36 బోట్లు, 88 పంపుసెట్లను తరలించారు. మరో 103 బోట్లను రప్పిస్తున్నారు.

■ దారుల్లో పడిపోయే చెట్లను వెంటనే తొలగించేలా పరికరాలు సిద్ధం చేస్తున్నారు.

■ వేగంగా సహాయక చర్యలు జరిగేందుకు వార్డులవారీ వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటుచేసి.. ఎక్కడ ఏ అవసరం ఉన్నా అందులో పోస్ట్ చేసేలా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. దీన్ని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ఇంటిగ్రేటెడ్ కమాండ్‌కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేస్తున్నారు.

స్వచ్ఛంద యువసేన



లోతట్టు ప్రాంతాల్లో కుటుంబీకుల వివరాలు సేకరిస్తున్న వాలంటీరు

జీసీసీకి నగరంలోని వాలంటీర్లు మరో బలంగా ఉన్నారు. ఈసారి స్వచ్ఛంద సేవకుల సైన్యాన్ని పెంచాలని చూస్తున్నారు. నగరంలోని సుమారు 100 కళాశాలల్లోని విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించారు. వీరినుంచి సహాయక చర్యలకోసం సుమారు 10వేల మందిని వినియోగించే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే 5వేల మంది విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు అధికారులు స్పష్టత ఇస్తున్నారు. మొత్తం వాలంటీర్ల ఎంపికయ్యాక ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు.

ప్రజల దృష్టి మళ్లించడానికే లడ్డూ అస్త్రం: ముత్తరసన్



మాట్లాడుతున్న ముత్తరసన్

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: ప్రజల దృష్టి మళ్లించడానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లడ్డూ వివాదం లేవనెత్తినట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్ ఆరోపించారు. ఆయన కోవైలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటాయని, దీని నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి భాజపా సూచనలతో చంద్రబాబు లడ్డూ అంశాన్ని లేవనెత్తారన్నారు. దేశంలో అనేక సమస్యలు ఉన్నాయని, వీటిని పక్కనపెట్టి దేవుడిని రాజకీయాల్లోకి లాగవద్దని సుప్రీంకోర్టు ఆయనకు మొట్టికాయలు వేయడం ఆహ్వానించదగ్గ అంశమన్నారు. కాంచీపురంలోని ఓ ప్రైవేట్ సెల్‌ఫోన్ల తయారీ సంస్థలో పనిచేస్తున్న 1500 మంది కార్మికులు కార్మిక సంఘాన్ని ఏర్పాటు చేయడానికి అనుమతి కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. పాలస్తీనా, లెబనాన్‌పై దాడి చేస్తున్న ఇజ్రాయెల్‌కు భారత్ మద్దతు తెలపడం దారుణమని మండిపడ్డారు. మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పాలస్తీనాను ప్రత్యేక దేశంగా అంగీకరించడాన్ని గుర్తుచేశారు.

విమానాశ్రయంలో వాననీటి కాలువల పనులు వేగవంతం

వడపళని, న్యూస్‌టుడే: విమానాశ్రయం (ఆపరేషన్ స్థలం)లో వాన నీరు నిలవకుండా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, మద్రాస్ (ఐఐటీఎం) సూచనల మేరకు జరుగుతున్న పనులు వచ్చే ఏడాది అక్టోబరుకల్లా పూర్తవుతాయని అధికారులంటున్నారు. కాలువలు 4.4 కిలోమీటర్లు, ప్రహరీలు 4.2 కి.మీ వరకు పటిష్ఠంగా ఉండేలా చూడాలని ఐఐటీఎం సూచించింది. తద్వారా రుతుపవనాల సమయంలో కురిసే వర్షాలకు నీటిని అరికట్టవచ్చని పేర్కొంది. రూ. 124 కోట్ల వ్యయంతో పనులు జరుగుతున్నాయి. పల్లావరం ఎమ్మెల్యే ఇ.కరుణానిధి పనులను ఇటీవల పరిశీలించారు. అడయార్ నదిలోకి చేరవేసేలా ముందుగా ఇప్పటికే ఉన్న వాన నీటి కాలువల పరిస్థితిని విమానాశ్రయ డైరెక్టర్ సీవీ దీపక్, కరుణానిధి కలిసి తనిఖీ చేశారు.

ఈరోడ్‌లో 53 మందికి క్యాన్సర్ నిర్ధారణ

3.57 లక్షల మందికి పరీక్షలు


ఈరోడ్ క్యాన్సర్ సెంటర్

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ఈరోడ్ జిల్లాలో 73 ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 18 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 98 గ్రామీణ ఆరోగ్య ఉప కేంద్రాలు, 8 ప్రభుత్వ ఆస్పత్రులు, ఓ ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రి సహా 198 సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా శిబిరాలు, మహిళా వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి పరీక్షలు చేస్తున్నారు. ఈ క్రమంలో జిల్లాలో 2,80,699 మందికి నోటి క్యాన్సర్ పరీక్షలు చేయగా 22 మందిని నిర్ధారించారు. రొమ్ము క్యాన్సర్ పరీక్ష చేయించుకున్న 86,063 మందిలో 22 మందికి ఉన్నట్లు గుర్తించారు. సర్వైకల్ పరీక్ష నిర్వహించిన 880 మందిలో 9 మందికి పాజిటివ్ వచ్చింది. మొత్తం 3,57,532 మందికి పరీక్షలు నిర్వహించగా 53 మంది క్యాన్సర్ బాధితులను గుర్తించినట్లు వైద్యులు తెలిపారు.

పలు విమాన సేవలకు అంతరాయం

వడపళని, న్యూస్‌టుడే: మెరీనాలో జరిగిన వాయు విన్యాసాల కారణంగా ఆదివారం పలు విమాన సేవలకు అంతరాయం కలిగింది. కౌలాలంపూర్, సింగపూర్, ఢిల్లీ విమానాలను బెంగళూరు, కోయంబత్తూరుకు దారి మళ్లించి, మూడు ఎయిరిండియా సర్వీసులు రద్దు చేశారు. కోల్‌కతా, గువాహటి, పోర్ట్ బ్లెయిర్ నుంచి వచ్చే పది విమానాలు, విశాఖపట్నం, ఢిల్లీ, గోవాకు వెళ్లాల్సిన తొమ్మిది విమానాలు ఆలస్యంగా నడిచాయి. ప్రయాణికులకు ముందుగానే సమాచారం తెలియజేశామని అధికారులన్నారు. ఐఏఎఫ్ విన్యాసాలు, భద్రత దృష్ట్యా జాగ్రత్తలు తీసుకున్నామని పేర్కొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న సీవ నాగరాజ్

వేలూర్, న్యూస్‌టుడే: వేలూర్ జిల్లా బాగాయం, అరియూర్ తదితర ప్రాంతాల్లో 18 ఏళ్లలోపు బాలురు ద్విచక్ర వాహనాలు నడపకుండా ఉండేందుకు ఆదివారం అవగాహన శిబిరాలు నిర్వహించారు. సీవ నాగరాజ్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ... 18 ఏళ్లలోపు బాలురు ద్విచక్ర వాహనాలు నడిపితే రూ.25 వేల జరిమానా విధించడంతో పాటు 25 ఏళ్ల వయసు వరకు లైసెన్సు పొందలేరని హెచ్చరించారు. వారి తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామని, నేరాలకు పాల్పడే వారిని సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంగా కనుగొని కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. సెల్‌ఫోన్లలో వచ్చే లింక్‌లు క్లిక్ చేయకూడదని, గంజాయి, పొగాకు ఉత్పత్తుల తరలింపు వారి వివరాలు తెలిపేవారికి బహుమతులు అందజేస్తామని ప్రకటించారు.

హొగినేకల్‌కు పెరిగిన నీటిరాక

విల్లివాక్కం, న్యూస్‌టుడే: కర్ణాటక రాష్ట్రంలో కావేరి పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు అక్కడి జలాశయాల నుంచి మిగులు జలాలను దిగువకు కావేరి నదిలోకి వదులుతున్నారు. దీంతో రాష్ట్రంలోని ధర్మపురి జిల్లా హొగినేకల్ జలపాతానికి ఈనెల 4న 8 వేల ఘనపుటడుగుల నీరు చేరగా శనివారం సెకనుకు 10 వేల ఘనపుటడుగులకు పెరిగింది. ఈ నేపథ్యంలో ఆదివారం 17 వేల ఘనపుటడుగులకు చేరింది. నీటిరాక ఇంకా పెరిగే అవకాశం ఉందని జలవనరుల శాఖాధికారులు పేర్కొన్నారు.


శరవణన్‌ను సత్కరిస్తున్న లాల్‌బహదూర్ శాస్త్రి

వాసవీ క్లబ్ ప్రాంతీయ సమావేశం

కాంచీపురం, న్యూస్‌టుడే: వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ రీజియన్-4 రీజినల్ సమావేశాన్ని ఆదివారం కాంచీపురం పమదరాజ వీధిలోని ఆర్య వైశ్య సమాజం కల్యాణ మండపంలో నిర్వహించారు. రీజినల్ ఛైర్మన్ వీకే బద్రినాథ్ నేతృత్వంలో నిర్వహించిన సమావేశంలో విశిష్ట అతిథిగా పాల్గొన్న వీకే లాల్‌బహదూర్ శాస్త్రి సమావేశాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ జోన్ ఛైర్మన్ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత శరవణన్‌ను సత్కరించారు. వాసవీ వనితా క్లబ్ డిస్ట్రిక్ట్ అల్లర్లర్ మంజుల, వాసవీ ఇంటర్నేషనల్ ఫర్ లేడీ ఆఫ్ రీజియన్ శరణ్య, కాంచీపురం వాసవీ క్లబ్ నిర్వాహకులు పలువురు పాల్గొన్నారు.


కార్మికుడికి జ్ఞాపిక అందజేస్తున్న తమిళ్‌సెల్వి

శుభ్రతా కార్మికులకు సత్కారం

తిరువళ్లూరు, న్యూస్‌టుడే: తిరువళ్లూరు సమీప కండిగ్రామం పంచాయతీలో 18 మంది శుభ్రతా కార్మికులు పనిచేస్తున్నారు. వీరు కరోనా కాలం నుంచి ఇప్పటివరకు పనుల్లో చురుగ్గా పాల్గొంటున్నారని ప్రశంసిస్తూ సత్కార కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. పంచాయతీ అధ్యక్షురాలు తమిళ్‌సెల్వి అధ్యక్షత వహించి కార్మికులను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. పంచాయతీ ఉపాధ్యక్షుడు జయకుమార్, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పలు రైళ్ల సేవల్లో మార్పు

వడపళని, న్యూస్‌టుడే: తిరుచ్చిరాపల్లి డివిజన్‌లో జరుగుతున్న సాంకేతిక పనుల కారణంగా **06028** విల్లుపురం - తాంబరం మెము రైలు 9, 11 తేదీల్లో తాత్కాలికంగా రద్దయింది. ఆ రోజుల్లో ఈ రైలు విక్రవాండి స్టేషను నుంచి 05.35కు బయలుదేరుతుందని దక్షిణ రైల్వే ఓ ప్రకటనలో తెలిపింది.

- **ఆలస్యంగా... 22671** ఎగ్మూరు - మదురై తేజస్ ఎక్స్‌ప్రెస్ 06.00 రైలు 9న 07.35కు, **22672** మదురై - ఎగ్మూరు 15.00 రైలు 9న 16.00కు బయలుదేరుతుంది.
- చెన్నై డివిజన్‌లో పనుల కారణంగా **22601** చెన్నై సెంట్రల్ - సాయినగర్ శిర్డీ 10.20 రైలు 9, 16, 23 తేదీలు 11.20కు ఆలస్యంగా నడుస్తుంది.

విద్యుత్తు కనెక్షన్లపై సూచనలు


- న్యూస్‌టుడే, వడపళని

కొత్తగా ఇల్లు నిర్మించుకున్న ఓ మహిళకు విద్యుత్తు కనెక్షను విషయంలో చేదు అనుభవం ఎదురైంది. సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సీఈఏ) నిబంధనల మేరకు కనెక్షను ఇవ్వొచ్చని టాన్‌జెడ్కోకు ఆదేశాలు జారీ అయ్యాయి. హైటెన్షన్‌తో కూడిన విద్యుత్తు లైన్లకు సమీపంలో ఉన్న గృహాలకు కొత్తగా కనెక్షన్లు ఇచ్చేందుకు సీఈఏ నిబంధనల మేరకు టాన్‌జెడ్కో తిరస్కరించడానికి వీల్లేదు. అయితే తంజావూరు జిల్లాకు చెందిన ఆర్.తేనాంబిక కొత్తగా నిర్మించుకున్న ఇల్లు నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్న కారణంగా కొత్త కనెక్షన్లు ఇవ్వడానికి కుదరదని టాన్‌జెడ్కో పేర్కొంది. దీంతో ఆమె కన్స్యూమర్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ ఫోరం (సీజీఆర్ఎఫ్)లో ఫిర్యాదు చేసినా చర్యలు చేపట్టలేదు.

సీజీఆర్ఎఫ్‌లో వాదనలు

టాన్‌జెడ్కో నుంచి ఈ రకమైన సమాధానాలు రాగా ఆమె 'సీఎం సెల్'ను సంప్రదించారు. అధికారుల ఆదేశాల మేరకు నేరుగా పరిశీలించేందుకు ముగ్గురు సభ్యులతో కూడిన బృందం ఇంటి వద్దకు వచ్చి పరిశీలించింది. ఇల్లు ఈహెచ్‌టీ లైన్‌కు 5.9 మీటర్ల దూరంలో ఉన్నట్టు గుర్తించింది. అయినా టాన్‌జెడ్కో ఆమె దరఖాస్తును మళ్లీ తిరస్కరించింది. అనంతరం తేనాంబిక సీజీఆర్ఎఫ్ విచారణ జరపాల్సిందిగా ఫిర్యాదు చేశారు. సీజీఆర్ఎఫ్ ఎదుట హాజరైన టాన్‌జెడ్కో అధికారులు.. ఆమె ఇంటి నిర్మాణం

రెండుసార్లు తిరస్కరణ

గత ఏప్రిల్‌లో కొత్తగా కట్టిన ఇంటికి తాత్కాలికంగా విద్యుత్తు కనెక్షను కోసం టాన్‌జెడ్కోను సంప్రదించానని తేనాంబిక తన పిటిషన్‌లో తెలిపారు. ఇంటి ప్లానుతో అధికారులను కలవగా, దరఖాస్తు తిరస్కరణకు గురైందని సమాధానమిచ్చారని, రెండోసారి దరఖాస్తు చేసుకున్నా 110 కేవీ 'ఎక్స్‌ట్రా హై టెన్షన్' (ఈహెచ్‌టీ) లైనుకు 2.9 మీటర్ల పరిధిలోపే ఇల్లు ఉందని పేర్కొంటూ తిరస్కరించారని వాపోయారు.

టాన్‌జెడ్కోకు వివరించిన సీఈఏ

జరపడానికి ముందుగానే 2.9 మీటర్ల పరిధిలో ఉందని, నిర్మాణ ప్లాను మార్చుకోవాలని, అప్పుడే విద్యుత్తు కనెక్షను ఇవ్వడానికి సాధ్యపడుతుందని చెప్పామని పేర్కొన్నారు. టాన్‌జెడ్కో నిబంధనలకు అనుకూలంగా లేకపోవడంతో ఆమె దరఖాస్తును తిరస్కరించాల్సి వచ్చిందని అధికారులు వివరించారు. అంతేకాకుండా ఆమె ఇల్లు విద్యుత్తుశాఖ ప్రతిపాదించిన డబుల్ సర్క్యూట్ టవర్ ప్రాంతంలో ఉందన్నారు.

◆ తమిళనాడు ఎలక్ట్రిసిటీ ఉన్నత అధికారి ఎన్.కణ్ణన్ మాట్లాడుతూ.. టాన్‌ట్రాన్స్‌కో రిపోర్టు మేరకు 13.9 మీటర్ల ఎత్తులో ఉన్న ఈహెచ్‌టీ లైన్లకు 5.1 మీటర్ల ఇల్లు ఉందన్నారు. సీఈఏ నిబంధనల మేరకు హెచ్‌టీ లైన్ల నుంచి ఏ నిర్మాణమైన సమాంతర క్లియరెన్స్‌కు 2.9 మీటర్లు, వర్టికల్ క్లియరెన్స్‌కు 4.6 మీటర్లు ఉండాలని పేర్కొంటూ సంస్థ స్పష్టం చేసిందన్నారు. దరఖాస్తు చేసుకున్న తేనాంబికకు టాన్‌జెడ్కో జాప్యం చేయకుండా కనెక్షను ఇచ్చి, 30 రోజుల్లోగా నివేదిక అందజేయాలని కణ్ణన్ పేర్కొన్నారు.

పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు పట్టించుకోవడం అనవసరం

మాజీ ఎంపీ తిరునావుక్కరసర్



ఆర్కేనగర్, న్యూస్‌టుడే: తమిళనాడు నాయకులను విమర్శించేంత జాతీయ స్థాయి నాయకుడు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కాదని, ఆయన వ్యాఖ్యలు పట్టించుకోనవసరం లేదని మాజీ ఎంపీ తిరునావుక్కరసర్ పేర్కొన్నారు. తిరుచ్చిలో కాంగ్రెస్ పార్టీ తరఫున పాతయాత్ర శనివారం సాయంత్రం నిర్వహించారు. పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడుతూ.... దేశంలో కాంగ్రెస్ పార్టీకి ఆదరణ పెరుగుతోందన్నారు. రాహుల్‌గాంధీ కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తే భాజపా వారు దేశాన్ని విమర్శించినట్లు దృష్టి మరల్చుతున్నారని చెప్పారు. పవన్ కల్యాణ్ ఆకస్మికంగా పిల్లైయార్‌లా పార్టీని స్థాపించారని, అదృష్టవశాత్తు విజయం పొందారన్నారు. ప్రస్తుతం చంద్రబాబునాయుడు దాతృత్వం వల్లే ఆయన ఉప ముఖ్యమంత్రి పదవి అలంకరించారని చెప్పారు. తమిళనాడు నాయకులను విమర్శించేంత జాతీయ స్థాయి నాయకుడేమీ కాదన్నారు. అందుకే రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఆయన అభిప్రాయాన్ని తోసిపుచ్చి వెళ్లిపోయారని చెప్పారు. విజయ్ పార్టీ మహానాడు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్య దేశంలో ఎవరైనా పార్టీని స్థాపించవచ్చని, అయితే అందరూ ఎంజీఆర్ కాలేరన్నారు.

రాష్ట్రానికి 17,100 మెట్రిక్‌టన్నుల గోధుమలు : మంత్రి చక్రపాణి


శిలాఫలకం ఆవిష్కరిస్తున్న చక్రపాణి

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: రాష్ట్రానికి నెలకు 17,100 మెట్రిక్‌టన్నుల గోధుమలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని ఆహారశాఖ మంత్రి చక్రపాణి తెలిపారు. దిండుక్కల్ జిల్లా ఒట్టన్‌సత్రం సమీపంలోని వడకాడు పంచాయతీలో నూతనంగా నిర్మించిన పంచాయతీ కార్యాలయ భవనాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆదిద్రావిడ, గిరిజన సంక్షేమశాఖ తరఫున 27 మంది లబ్ధిదారులకు రూ.1.54 కోట్లతో ఇళ్లు నిర్మించేందుకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... మరో 10 ఏళ్లలో గుడిసెలు లేని రాష్ట్రంగా మార్చే లక్ష్యంతో పేదలకు ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు 'కలైజ్ఞర్ కనవు ఇల్లం తిట్టం'లో 8 లక్షల ఇళ్లు నిర్మించి ఇస్తున్నట్లు తెలిపారు. అందులో లక్ష ఇళ్లు ఈ ఏడాదిలోనే నిర్మించి ఇస్తామన్నారు. రాష్ట్రానికి నెలకు 8 వేల మెట్రిక్‌టన్నుల గోధుమలు అందుతున్నాయని, దానిని ప్రస్తుతం 17,100 మెట్రిక్‌టన్నులకు పెంచి ఇచ్చేందుకు కేంద్రం ఆమోదం తెలిపిందన్నారు.

మద్య నిషేధం వెంటనే అమలుచేస్తామని చెప్పలేదు : మంత్రి రఘుపతి


విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి రఘుపతి

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: సంపూర్ణ మద్య నిషేధం వెంటనే అమలు చేస్తామని తమ ప్రభుత్వం చెప్పలేదని న్యాయశాఖ మంత్రి రఘుపతి తెలిపారు. పుదుకోట్టైలోని అగరంబట్టి, పెరుమాల్‌పట్టి ప్రాంతాల్లో కొత్తగా నిర్మించిన అంగన్‌వాడీ భవనాలను ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... క్రమంగా మద్యం దుకాణాలను తగ్గించడమే తమ లక్ష్యమన్నారు. రాజకీయ పార్టీలు స్థాపించే వారంతా చెప్పేదే నటుడు విజయ్ కూడా చెప్పారన్నారు. ప్రత్యేకంగా ఏమీ చెప్పలేదన్నారు. తాము వెళ్లే మార్గంలో స్పష్టంగా ఉన్నామన్నారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో 200 సీట్లు లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. తమను నేరుగా ఎవరూ ప్రభుత్వంలో భాగస్వామ్యం అడగలేదన్నారు. అన్బుమణికి అధికారంలో ఉంటే తెలుస్తుందని, సంపూర్ణ మద్య నిషేధం దేశవ్యాప్తంగా అమలు చేస్తేనే సాధ్యమవుతుందన్నారు. అయినా రాష్ట్రంలో అమలుకు ముఖ్యమంత్రి చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు.


కోయంబత్తూరు ఆర్ఎస్‌పురంలో వివిధ పార్టీల్లోని విద్యార్థి విభాగానికి చెందిన వారు ఆదివారం మాజీ మంత్రి ఎస్పీ వేలుమణి సమక్షంలో అన్నాడీఎంకే తీర్థం పుచ్చుకున్నారు. - కోయంబత్తూరు, న్యూస్‌టుడే

జాలర్ల వలల్లో చిక్కిన 150 టన్నుల చేపలు

వేళచ్చేరి, న్యూస్‌టుడే: కడలూర్ జిల్లాలో 49 మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో చేపల వేట ఆధారంగా సుమారు లక్ష మంది నాటు పడవలు, ఫైబర్ పడవలను ఉపయోగించుకొని జీవనోపాధి పొందుతున్నారు. ఇదిలా ఉండగా కడలూర్ దేవీపట్నం ప్రాంతానికి చెందిన మత్స్యకారులు రెండు రోజుల క్రితం సముద్రంపైకి వేటకు వెళ్లారు. ఈ సందర్భంగా వలల్లో అనేక రకాలైన సుమారు 150 టన్నుల చేపలు చిక్కాయి. వాటితో శనివారం రాత్రి తీరానికి చేరుకున్నారు.


చేపలతో మత్స్యకారులు

వైభవంగా నవరాత్రి ఉత్సవాలు




శాలవాక్కం స్వర్ణపురీశ్వర ఆలయంలో అష్టలక్ష్మిల అలంకరణలో చిన్నారులు ◆ అలంకరణలో లక్ష్మి, సరస్వతి సమేత కామాక్షి అమ్మవారు ◆ బొమ్మల కొలువు

కాంచీపురం, న్యూస్‌టుడే: కాంచీపురం కామాక్షి అమ్మవారి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారిని మొదటి మూడు రోజులు కామాక్షిగా, తరువాత 3 రోజులు లక్ష్మిగా, చివరి మూడు రోజులు దుర్గమ్మ అవతారంలో అలంకరించి నవరాత్రి మండపంలో భక్తుల దర్శనార్థం ఉంచుతారు. ప్రతిరోజూ శూరసంహారం నిర్వహిస్తారు. అదేవిధంగా కాంచీపురంలోని అనేక అమ్మవారి ఆలయాల్లో నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి శాలవాక్కంలోని స్వర్ణపురీశ్వరాలయంలో చిన్నారులు అష్టలక్ష్మిల వేషధారణలో ఆకట్టుకున్నారు.

ఆధ్యాత్మికం


ఊత్తుకోటకు చేరుకున్న తిరుమలేశుని రథం

ఊత్తుకోట, న్యూస్‌టుడే: తిరునిండ్రవూరు నుంచి తిరుమలకు గొడుగులతో రథం బయలుదేరింది. శనివారం రాత్రి ఊత్తుకోటకు చేరుకుంది. పెద్ద సంఖ్యలో భక్తులు రథానికి స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని పది ప్రాంతాల్లో వందలాది మందికి అన్నదానం చేశారు. రథం, గొడుగులు సోమవారం తిరుమలకు చేరుకుంటాయని ఊరేగింపు నిర్వాహకులు తెలిపారు.


గరుడ వాహనంపై వేంకటేశ్వరుడు

కనులపండువగా గరుడ సేవ

టీనగర్, న్యూస్‌టుడే: చెన్నై కొరుక్కుపేటలోని శ్రీ వేంకటేశ్వర సుప్రభాత సభ 54వ వార్షికోత్సవంలో భాగంగా శనివారం శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. రాత్రి ఏడు గంటలకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి దర్శనం చేసుకున్నారు. సాయంత్రం గరుడ సేవ, ఊరేగింపు జరిగాయి.

మీనాక్షీదేవిగా కన్యకాపరమేశ్వరి కటాక్షం


మీనాక్షి అలంకరణలో కన్యకాపరమేశ్వరి


లలితా త్రిపుర సుందరిగా శ్రీకొళ్లాపురమ్మ


గజలక్ష్మిగా పరాశక్తి అమ్మవారు

పళ్లిపట్టు, న్యూస్‌టుడే: పళ్లిపట్టు బజారు వీధిలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన ఆదివారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, దీపారాధనలు చేశారు. సాయంత్రం అమ్మవారు మీనాక్షి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే పళ్లిపట్టు శ్రీకొళ్లాపురమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, దీపారాధనలు జరిగాయి. రాత్రి లలితా మహా త్రిపుర సుందరి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

తిరువణ్ణామలై: తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయంలోని వివాహ మండపంలో పరాశక్తి అమ్మవారికి ఆదివారం ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారు గజలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు.

రోడ్డు పక్కన నవజాత శిశువు లభ్యం


ఆసుపత్రిలో శిశువును అప్పగిస్తున్న అంబులెన్స్ సిబ్బంది

వేళచ్చేరి, న్యూస్‌టుడే: చిదంబరం అన్నామలై పోలీసు స్టేషన్ పరిధిలోని దక్షిణ పిచ్చావరం, సెంజి కాలనీలో బాలరాజ్ అనే వ్యక్తి ఇంటికి సమీపంలో ఆదివారం ఉదయం రోడ్డు పక్కన నవజాత ఆడ శిశువును స్థానికులు గుర్తించారు. ప్రాణాలతో ఉండటంతో 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని శిశువును స్వాధీనం చేసుకొని చిదంబరం ప్రభుత్వ ఆసుపత్రిలో అప్పగించారు. శిశువు ఎవరు వదిలి వెళ్లారనేదానిపై పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.


రోగులతో మాట్లాడుతున్న ఇళంగో మహేశ్వరన్

ఈఎస్ఐ ఆస్పత్రిలో తనిఖీ

వేలూర్, న్యూస్‌టుడే: వేలూర్ బ్యాండ్‌లాండ్ రోడ్డులో ఈఎస్ఐ ఆస్పత్రిలో ఆదివారం రాష్ట్ర ఆరోగ్యశాఖ డైరెక్టర్ ఇళంగో మహేశ్వరన్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. రోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మందుల నిల్వ గది, శస్త్రచికిత్స విభాగాలను సందర్శించారు. సిద్ధ, ఆయుర్వేద, యోగా, ప్రకృతి వైద్య విభాగాలను పరిశీలించారు. తాటునీటి ట్యాంకు, మురుగుదొడ్లను ప్రతి రోజు శుభ్రం చేయాలని సూచించారు. ఆస్పత్రి సూరింటెండెంట్ జయగీత వెంట ఉన్నారు.

మానవ ఎముకలతో పూజలు

పోలీసుల దర్యాప్తు



పూజ చేసినట్లు కనిపిస్తున్న ఆనవాళ్లు

వేలూర్, న్యూస్‌టుడే: తిరుపత్తూరు జిల్లా ఇరుళాపట్టులోని వాగు పక్కన పంచాయతీ మాజీ అధ్యక్షుడు సత్యమూర్తికి చెందిన కొబ్బరి తోట ఉంది. ఇతను ఆదివారం ఉదయం తోటకు వెళ్లగా సమీపంలో పెద్ద గుంత తవ్వి ఉండడాన్ని గుర్తించారు. అందులో పూజ సామగ్రి, మానవ ఎముకలు ఉండడాన్ని గమనించాడు. ఇందుకు సంబంధించి ఆయన గురిసిలాపట్టు వీఏవో వడివేలుకు సమాచారం అందించాడు. అతను పోలీసులతో ఘటనా స్థలానికి చేరుకున్నాడు. నరబలి ఇచ్చేందుకు గుంత తవ్వారా? మరేదైనా కారణం ఉందా? అని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వాసుకి

రాష్ట్ర ఆలయ ఉద్యోగుల సంఘ సమావేశం

వేళచ్చేరి, న్యూస్‌టుడే: తమిళనాడు ఆలయ ఉద్యోగుల సంఘం చెన్నై డివిజన్ సాధారణ సర్వసభ్య సమావేశం, ఆవడిలో సంఘం కొత్త శాఖ ప్రారంభోత్సవం పాడి తిరువళీశ్వర ఆలయం సమీపంలోని ఓ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. అర్చకుడు జ్ఞానసంబంధన్ నేతృత్వంలో నిర్వహించిన సమావేశంలో చెన్నై డివిజన్ అధ్యక్షుడు ధనశేఖర్, కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయాల్లో పనిచేసే ఉద్యోగులను ప్రభుత్వ సిబ్బందిగా పరిగణించాలని, తాత్కాలిక సిబ్బంది 1100 రోజులు లేదా 3 ఏళ్లు పనిచేసి ఉంటే వారిని పర్మినెంట్ చేయాలని, ఆలయ ఈవోల స్థాయి 4 పోస్టులను టీఎన్‌పీఎస్సీ ద్వారా 25 శాతం అంతర్గత రిజర్వేషన్ల మేరకు భర్తీ చేయాలని మొదలైన తీర్మానాలను ఆమోదించారు. దేవాదాయశాఖ అధికారుల సంఘ రాష్ట్ర అధ్యక్షురాలు వాసుకి, పలువురు అధికారులు పాల్గొన్నారు.


విజేతలతో ముఖ్య అతిథి, నిర్వాహకులు

విద్యార్థులు కళల్లోనూ రాణించాలి

ప్యారిస్, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతోపాటు తమకు ఇష్టమైన ఏదో ఒక కళలోనూ రాణించాలని ఊరా గ్రూప్ ఛైర్మన్ ఊరా లక్ష్మీనరసింహారావు హితవుపలికారు. ఇండియన్ ఫైన్ ఆర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో సంగీత ఉత్సవాల సందర్భంగా ఇటీవల సంగీతం నేర్చుకుంటున్న విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఆళ్వారుపేటలోని యతిరాజ కల్యాణ నిలయంలో ఆదివారం పోటీలలో విజేతలకు లక్ష్మీ నరసింహారావు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో భాగంగా ప్రముఖ వాగ్గేయకారులు ముత్తుస్వామి దీక్షితులు సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. ధనుష్ అనంతరామన్ గాత్రకచేరి జరిగింది. వయోలిన్‌పై శుభశ్రీ శివరామకృష్ణ, మృదంగంపై పున్నూరు అరవింద్ కౌశిక్ వాద్య సహకారం అందించారు. ముత్తుస్వామి దీక్షితుల కృతులను శ్రావ్యంగా వినిపించి ఆ వాగ్గేయకారునికి సంగీత నీరాజనం అందించారు. కార్యదర్శి డాక్టర్ పి రాధాకృష్ణన్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.


గానం చేస్తున్న ధనుష్

వనితా విజయకుమార్ దర్శకత్వంలో Mr & Mrs




చెన్నై, న్యూస్‌టుడే: రాబర్ట్ మాస్టర్‌కు ప్రపోజ్ చేస్తున్నట్లు ఉన్న ఫొటోను ఇటీవల నటి వనితా విజయకుమార్ తన 'ఎక్స్' పేజీలో పోస్టు చేశారు. అక్టోబరు 5 అని రాసి 'సేవ్ ది డేట్' అని ఫొటోపై పేర్కొనడం పలువురిలో ఆసక్తిని రేపింది. రాబర్ట్ మాస్టర్‌ను వనిత పెళ్లి చేసుకోనున్నారా? లేక సినిమా ప్రమోషన్‌లో భాగంగా ఈ ఫొటోనూ వైరల్ చేస్తున్నారా? అనే అభిప్రాయాలు వినిపించాయి. ఈ ఉత్కంఠకు ముగింపు పలుకుతూ రాబర్ట్ మాస్టర్, వనితా విజయకుమార్ జంటగా నటిస్తున్న సినిమా ప్రమోషన్ వీడియోను చిత్రబృందం శనివారం విడుదల చేసింది. ఆ చిత్రానికి 'Mr & Mrs' అనే టైటిల్ ఖరారు చేశారు. చిత్రాన్ని వనితా విజయకుమార్‌కు చెందిన వనితా ఫిల్మ్ ప్రొడక్షన్ నిర్మిస్తోంది. చిత్రానికి శ్రీకాంత్ దేవా సంగీతం సమకూర్చుతున్నారు. కథ, దర్శకత్వ బాధ్యతలను వనితా విజయకుమార్ చేపట్టారు.

మణిరత్నం, రజినీకాంత్ కాంబినేషన్లో సినిమా?



చెన్నై: దర్శకుడు మణిరత్నం, నటుడు రజినీకాంత్ కాంబినేషన్లో 1991లో విడుదలై భారీ విజయాన్ని సొంతం చేసుకున్న చిత్రం 'దళపతి'. ఈ చిత్రం ద్వారా అరవిందసామి నటుడిగా వెండితెరకు పరిచయమయ్యారు. రజినీకాంత్ సినీ ప్రస్థానంలో ఈ చిత్రం ఓ మైలురాయిగా నిలిచింది. దీంతో మణిరత్నం, రజినీకాంత్ కాంబినేషన్‌లో మరో చిత్రం కోసం సుదీర్ఘకాలంగా సినీ అభిమానులు నిరీక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో వీరిద్దరి కాంబినేషన్‌లో చిత్రం తెరకెక్కనుందని, దీనికి సంబంధించిన ప్రకటన రజినీకాంత్ పుట్టినరోజు సందర్భంగా డిసెంబరు 12న అధికారికంగా వెల్లడించనున్నారని కోలీవుడ్ సమాచారం.



సార్ విడుదల 18న

చెన్నై: గ్రాస్ రూట్ పతాకంపై బోస్ వెంకట్ దర్శకత్వం వహించిన చిత్రం 'సార్'. విమల్ ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రం రానున్న 18న విడుదల కానున్నట్టు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. బాలసుబ్రమణి దర్శకత్వంలో జీవ, ప్రియా భవానీ శంకర్ జంటగా నటించిన 'బ్లాక్' చిత్రం రానున్న 11న విడుదల కానున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.

అర్జున్‌దాస్ చిత్రానికి వన్స్ మోర్ టైటిల్

చెన్నై: వర్ధమాన దర్శకుడు విఘ్నేశ్ శ్రీకాంత్ దర్శకత్వంలో అర్జున్‌దాస్, అదితి శంకర్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న చిత్రానికి 'ప్రొడక్షన్ నంబర్ 4'గా తాత్కాలిక టైటిల్ ఖరారు చేసి చిత్రీకరణను ప్రారంభించారు. ఈ నేపథ్యంలో చిత్రానికి 'వన్స్ మోర్' టైటిల్ ఖరారు చేస్తూ టైటిల్ లుక్ టీజర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ టీజర్‌ను దర్శకుడు లోకేశ్ కనకరాజ్ తన 'ఎక్స్' పేజీలో ఉంచారు. చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకుడు హేషం అబ్దుల్ వహాబ్ సంగీతం సమకూర్చుతున్నారు.



మరికొన్ని సినీ విశేషాలు

❖ వేల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్స్ ప్రొడక్షన్ సంస్థ ప్రస్తుతం సుందర్.సి దర్శకత్వంలో 'మూకుత్తి అమ్మన్ 2', జయం రవి హీరోగా 'జీని' చిత్రాలను నిర్మిస్తోంది. ఈ నేపథ్యంలో తమ తదుపరి చిత్రం గురించి సోమవారం సాయంత్రం 6 గంటలకు ప్రకటించనున్నట్లు ఆ నిర్మాణ సంస్థ వెల్లడించింది.

❖ ప్రిన్స్ పిక్చర్స్ నిర్మాణంలో గ్రామీణ క్రికెట్ నేపథ్యంతో రూపొందిన 'లబ్బర్ పందు' చిత్రం విడుదలై పలువురి ప్రశంసలు అందుకుంటోంది. నటుడు దినేశ్ కనిపించే సన్నివేశంలో విజయకాంత్‌కు చెందిన 'నీ పొట్టు వచ్చ తంగ కుడం..' పాట వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో చిత్రంలోని దినేశ్ ఇంట్రో పాటను చిత్రబృందం విడుదల చేసింది.


రేషన్ దుకాణాలు దీపావళికి ముందే ప్రారంభం: పుదువై సీఎం రంగసామి

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: ప్రముఖ సినీ నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం మొదటి రాష్ట్ర మహానాడు ఈనెల 27న జరుగనుంది. ఈ క్రమంలో మహానాడు విజయవంతం కావాలని, పార్టీ అభివృద్ధి చెందాలని పుదుచ్చేరి ముఖ్యమంత్రి రంగసామి ఆకాంక్షించారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ... రేషన్ దుకాణాల ప్రారంభంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. దీపావళికి ముందుగానే అన్ని దుకాణాలను తెరిచేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. మొదట రేషన్‌లో ఉచితంగా 2 కిలోల చక్కెర, 10 కిలోల బియ్యం దీపావళి కానుకగా అందిస్తామని చెప్పారు. దుకాణాలలో పని చేసే సిబ్బందికి ఇక నెల వేతనం అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇందుకోసం రూ.1.45 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. రాష్ట్ర హోదా తీర్మానాన్ని కేంద్రానికి పంపామన్నారు. దిల్లీకి వెళ్లి ప్రధానిని కలిసి దీని గురించి మాట్లాడుతామని చెప్పారు. తనకు ఇప్పటివరకు టీవీకే మహానాడులో పాల్గొనాలని పిలుపు రాలేదని, వస్తే కచ్చితంగా వెళ్తామని తెలిపారు.

పోలీసు భద్రతతో ఆర్ఎస్ఎస్ ర్యాలీ

ప్యారిస్, న్యూస్‌టుడే: పటిష్ఠ పోలీసు భద్రత నడుమ చెన్నైలో ఆర్ఎస్ఎస్ ర్యాలీ జరిగింది. విజయదశమి సందర్భంగా ఆర్ఎస్ఎస్ తరఫున పలు ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. ఎగ్మూరులో జరిగిన కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి ఎల్.మురుగన్, వంద మందికి పైగా కార్యకర్తలు పాల్గొన్నారు. తెన్‌కోటిలో సుమారు 3 కిలోమీటర్ల మేర జరిగింది. ఇందులో 300 మందికి పైగా పాల్గొన్నారు.

భక్తురాలి అదృశ్యం



మన్నాంగతి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరుని దర్శనార్థం వచ్చిన తమిళనాడు భక్తురాలు అదృశ్యమయ్యారు. ఈ మేరకు ఆదివారం వారి కుటుంబీకులు ఆదివారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమిళనాడులోని పెరంబుదూరు జిల్లా బ్రహ్మదేశం గ్రామానికి చెందిన మన్నాంగతి (70)తో పాటు దాదాపు అరవై మంది గ్రామస్థులు ఈ నెల 3వ తేదీన ఇక్కడి ముక్కంటి ఆలయాన్ని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నదానంలో భోజనం చేశాక వృద్ధురాలు మన్నాంగతి కన్పించకుండా పోవడంతో గ్రామంలోనూ ఆరా తీశారు. ఇక్కడ అంతా వెతికినా కన్పించకపోవడంతో ఆదివారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణ సీఐ గోపి ఆదేశాల మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

ఆలయాల్లో శరన్నవరాత్రుల శోభ

ప్యారిస్, న్యూస్‌టుడే: జార్జిటౌన్‌లోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వేద పండితుల చతుర్వేద పారాయణాలు, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మూలమంత్ర హోమంతోపాటు నాలుగో రోజు అయిన ఆదివారం వేడుకలకు శ్రీకారం చుట్టారు. అమ్మవారికి త్రికాల అభిషేకాలు, అలంకారాలు, ఆరాధనలు నిర్వహించారు. సాయంత్రం మూలవిరాట్టును బంగారు ఆభరణాలతో, ఉత్సవమూర్తిని శేషవాహనంపై బాల త్రిపుర సుందరిగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కలిగించారు. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా మహర్షి విద్యా మందిర్ చిన్నారుల బృందగానం, లయ వాద్య కళాకారుల లయ విన్యాసం రంజింపజేశాయి. ఆదివారం ఉత్సవానికి ది మదరాస్ ఆర్యవైశ్య షరాఫ్ మర్చంట్స్ నవరాత్రి ఉత్సవ సమితి ఉభయకర్తగా వ్యవహరించింది. పాలకమండలి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



బాల త్రిపుర సుందరిగా కన్యకాపరమేశ్వరి



ఎంవీఎం పాఠశాల విద్యార్థుల నాటకం



లేపాక్షి పక్కన ఉన్న దుకాణాన్ని మూసివేయిస్తున్న అధికారులు

తిరుమలలోని దుకాణదారులపై చర్యలు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి బ్రహ్మోత్సవాను పురస్కరించుకుని పెద్ద సంఖ్యలో వచ్చే భక్తులకు దుకాణదారులు అధిక ధరలకు విక్రయించడం, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల్లో పరిశుభ్రత పాటించకపోవడం వంటివాటిపై తిరుమల రెవెన్యూ విభాగం అధికారులు చర్యలు చేపట్టారు. ఆదివారం తితిదే ఎస్టేట్ అధికారి వెంకటేశ్వర రావు, ఏఈవో నారాయణ చౌదరి, టాస్క్‌ఫోర్ అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహించారు. రెండు టీ దుకాణాలు, రెండు ఫ్యాన్సీ షాపులను సీజ్ చేశారు. గోవర్ధన్ సత్రం వద్ద తితిదే కేటాయించిన స్థలాల కంటే ఎక్కువ ఆక్రమించుకుని అపరిశుభ్ర వాతావరణంలో నిర్వహిస్తున్న ఐదు ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలు సీజ్ చేశారు. పీఏసీ-1 వద్ద ఎక్కువ స్థలం ఆక్రమించుకుని వ్యాపారం నిర్వహిస్తున్న మూడు హాకర్ లైసెన్సులను తాత్కాలికంగా స్వాధీనం చేసుకున్నారు. డీఎంబీ రోడ్డులో భక్తులకు అడ్డంగా వ్యాపారాలు నిర్వహిస్తున్న వారికి హెచ్చరికలు జారీచేశారు.

ఆధ్యాత్మిక పుస్తకాల ఆవిష్కరణ

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో మూడో రోజు ఆదివారం ఉదయం జరిగిన సింహ వాహన సేవలో నాలుగు ఆధ్యాత్మిక పుస్తకాలను కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస శర్మ, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి, తితిదే ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి తదితరులు ఆవిష్కరించారు. మారెళ్ల వెంకట శేషారెడ్డి రచించిన 'శ్రీ భాగవతము-ప్రశ్నావళి', డా.కప్పగంతుల రామకృష్ణ రచించిన 'హైందవ సంస్కృతి- వైజ్ఞానికత', డా.పుట్టపర్తి నాగపద్మిని రచించిన 'తిరుమల తిరుపతి క్షేత్ర మహత్మ్యమ్ (హిందీ), వావిలి కొలను సుబ్బారావు రచించిన 'శ్రీమదొంటిమిట్ట కోదండరామ మహత్మ్యం-వివరణ' పుస్తకాలను ఆవిష్కరించారు.



పుస్తకావిష్కరణలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి, కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసశర్మ, తితిదే ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్యచౌదరి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి తదితరులు

గర్భిణుల సందేహాల నివృత్తికి వెబ్‌సైట్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: ప్రసూతి సమయంలో వచ్చే వివిధ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రుల తరపున ఆన్‌లైన్ సేవను ప్రారంభించారు. చెన్నై రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఆస్పత్రి కింద పనిచేసే ఎగ్మూర్ ప్రభుత్వ ప్రసూతి, తిరువళ్లికేణిలోని కస్తూర్బాగాంధీ ప్రసూతి ఆస్పత్రులు సంయుక్తంగా www.iogkgh.org.in అనే వెబ్‌సైట్‌ను ఆవిష్కరించాయి. ఈ సేవలను రాజీవ్‌గాంధీ ఆస్పత్రి డీన్ ధరణిరాజన్ శనివారం ప్రారంభించారు. ఈ ఆన్‌లైన్ సేవను సులభంగా పొందేలా క్యూఆర్ కోడ్‌లను ఆస్పత్రుల్లో అంటించారు. వెబ్‌సైట్‌లో కడుపులో బిడ్డ ఎదుగుదల, గర్భధారణ సమయంలో శరీరం, మానసిక ఆరోగ్యం, మధుమేహం, గుండెజబ్బులు, ఊబకాయం, అధిక రక్తపోటు సహా 15 అంశాలపై సందేహాలకు తమిళం, ఆంగ్లంలో సమాధానాలు దొరుకుతాయి. దీని గురించి ప్రసూతి వైద్యురాలు విద్య మాట్లాడుతూ... ఓ మహిళ గర్భధారణతో ప్రారంభమై గర్భకాలం, బిడ్డ జననం, ప్రసవం తర్వాత ప్రయాణానికి ఈ ఆన్‌లైన్ సేవ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. గర్భిణులు, వారి భర్తలు, కుటుంబీకులు ఈ సేవ ద్వారా సందేహాలకు సమాధానాలను తెలుసుకోవచ్చని చెప్పారు. మందులు, మాత్రలు తీసుకోవడం, స్కాన్ చేయించుకోవడం వంటి పలు సందేహాలకు పరిష్కారాలు అందులో ఉంటాయన్నారు. దానితోపాటు గర్భకాలంలో వ్యాయామం, యోగా చేయడం వలన కలిగే ప్రయోజనాలు, అందుకు సంబంధించి ఫొటోలు, వీడియోలు, సంగీతం వంటివి కూడా అందులో ఉంటాయని తెలిపారు.



అంబాళ్ సన్నిధిలో నిలిచిన నీరు

రామనాథస్వామి ఆలయంలోకి వాననీరు

ప్యారిస్, న్యూస్‌టుడే: రామేశ్వరం రామనాథస్వామి ఆలయంలోకి వాననీరు చేరడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బంగాళాఖాతంలో నెలకొన్న అల్పపీడనం కారణంగా తమిళనాడులో చాలా చోట్ల 11వ తేదీ వరకు మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని చెన్నై వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది. ఈ నేపథ్యంలో రామనాథపురం జిల్లా సముద్రతీర ప్రాంతాల్లో శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు భారీవర్షం కురిసింది. దీంతో పాంబన్, తంగచ్చిమఠం, రామేశ్వరం మొదలైన లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. అంతేకాకుండా రామనాథస్వామి ఆలయంలోని అంబాళ్ సన్నిధిలోకి వాననీరు చేరడంతో భక్తులు అసౌకర్యానికి గురయ్యారు.

వేడుకగా శ్రీవారి గొడుగుల ఊరేగింపు

నాగలాపురం, న్యూస్‌టుడే: తమిళనాడులోని తిరునింద్రయూర్ శ్రీమత్ రామానుజ కైంకర్య ట్రస్టు ఆధ్వర్యంలో తిరుమల శ్రీవారికి గరుడసేవకు అందించనున్న గొడుగులను ఆదివారం నాగలాపురం, పిచ్చాటూరులలో ఊరేగించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి విగ్రహాలతో కూడిన వాహనాన్ని ట్రస్టు నిర్వాహకులు ఊరేగింపుగా తీసుకెళ్లారు. నాగలాపురంలోని భద్రావతి సమేత భావనారుషి ఆలయానికి గొడుగును ట్రస్టు సభ్యులు వితరణగా అందించారు. దామోదరం మొదలియార్, విజయకుమార్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఇళంగోవన్‌రెడ్డిలు పాల్గొన్నారు.

చిదంబరం ఆలయ భూములు స్వాధీనం చేసుకోవాలి

కలెక్టర్లకు మద్రాసు హైకోర్టు ఆదేశం

ప్యారిస్, న్యూస్‌టుడే: చిదంబరం నటరాజర్ ఆలయానికి చెందిన 3 వేల ఎకరాల భూమిని స్వాధీనానికి జిల్లా కలెక్టర్లు తగిన చర్యలు చేపట్టాలని మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. చిదంబరం నటరాజర్ ఆలయం ప్రస్తుతం దీక్షితుల ఆధీనంలో ఉంది. ఈ ఆలయానికి పెరంబలూరు, తిరునెల్వేలి, కారైక్కాల్, సేలం తదితర రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సుమారు 3 వేల ఎకరాల భూములు ఉన్నాయి. అవి ప్రస్తుతం ఆక్రమణలకు గురయ్యాయని, అంతే కాకుండా చిదంబరంలో మాణిక్యవాసగర్ ప్రారంభించిన గురు నమశ్శివాయ మఠానికి చెందిన ఆస్తులు అదృశ్యమైనట్లు, వాటిని స్వాధీనం చేసుకొని సంరక్షించేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు.. కడలూరు, కారైక్కాల్ మొదలైన జిల్లాల కలెక్టర్లు దేవాదాయశాఖ అధికారులతో కలిసి చిదంబరం నటరాజర్, గురు నమశ్శివాయం మఠానికి చెందిన ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు 12 వారాల్లో తగిన చర్యలు చేపట్టాలని ఉత్తర్వులు ఇచ్చారు.

టీఎం కృష్ణకు 'ఎంఎస్ సుబ్బులక్ష్మి' పురస్కారం ఇవ్వకూడదు

హైకోర్టులో ఎంఎస్ సుబ్బులక్ష్మి మనవడు కేసు

ప్యారిస్, న్యూస్‌టుడే: 'సంగీత కళానిధి ఎంఎస్ సుబ్బులక్ష్మి' పురస్కారాన్ని 2024 ఏడాదికిగాను గాయకుడు టీఎం కృష్ణకు ప్రదానం చేయకూడదని ఎంఎస్ సుబ్బులక్ష్మి మనవడు శ్రీనివాసన్ హైకోర్టులో కేసు వేశారు. ఆయన దాఖలు చేసిన సివిల్ కేసులో... 2004లో తన బామ్మ మరణం తర్వాత మ్యూజిక్ అకాడమీ, ఆంగ్ల దినపత్రిక కలిసి 2005 నుంచి 'సంగీత కళానిధి ఎంఎస్ సుబ్బులక్ష్మి' పేరిట పురస్కారం, రూ.లక్ష నగదు బహుమతి అందజేస్తున్నాయని, మ్యూజిక్ అకాడమీ వార్షిక కచేరి సీజన్‌లో ఏటా ఈ అవార్డును అందిస్తున్నారని తెలిపారు. రానున్న డిసెంబరులో 98వ వార్షిక వేడుకల సందర్భంగా టీఎం కృష్ణకు అవార్డు ప్రదానం చేయనున్నట్లు ప్రకటించిందన్నారు. తన బామ్మపై అనుచిత వ్యాఖ్యలు చేసిన టీఎం కృష్ణకు అవార్డు ప్రకటన తన కుటుంబీకులను దిగ్భ్రాంతికి గురిచేసిందని పేర్కొన్నారు. డిసెంబరులో జరిగే వేడుకల్లో కృష్ణకు అవార్డు ఇవ్వడంపై నిషేధం విధించాలని కోరారు. ఇందుకు సంబంధించి మ్యూజిక్ అకాడమీ స్పందిస్తూ.. అవార్డు పొందేవారిని ఎన్నుకోవడంలో తమకు ఎలాంటి భాగస్వామ్యం లేదని, 2005 నుంచి ఆంగ్ల పత్రిక బృందం అవార్డు అందిస్తుందని, ఇందుకు ఎంఎస్ సుబ్బులక్ష్మి కుటుంబం నుంచి ఎలాంటి అభ్యంతరం తెలపలేదని సమాధానం ఇచ్చింది. అనంతరం పిటిషన్‌ని విచారించిన జస్టిస్ టీక్కారామన్... గాయకుడు టీఎం కృష్ణ సమాధానం ఇవ్వాలని ఉత్తర్వులు ఇచ్చి తదుపరి విచారణను అక్టోబరు 21కి వాయిదా వేశారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు కళాశాల విద్యార్థుల మృతి



మృతులు (పాతచిత్రాలు)

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనాన్ని కంటైనర్ లారీ ఢీకొనడంతో ముగ్గురు కళాశాల విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. పోలీసుల కథనం మేరకు... దిండుక్కల్ జిల్లా నత్తం అశోక్‌నగర్‌కు చెందిన దినకరన్ (20), వేలాంబట్టికి చెందిన బాలాజీ (19).. మరో స్నేహితుడితో కలిసి ద్విచక్ర వాహనంపై ఆదివారం నత్తం రోడ్డులో గోపాల్‌పట్టి వద్ద వెళ్తుండగా వేగంగా ఎదురుగా వచ్చిన కంటైనర్ లారీ ఢీకొంది. ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేపట్టారు. ఇదిలా ఉండగా జ్యూస్ పరిశ్రమ నుంచి వచ్చే లారీలు అతివేగంగా వస్తూ తరచూ ప్రమాదాలకు కారణమవుతున్నాయని ఆరోపిస్తూ స్థానికులు ఘటనా స్థలంలో ఆందోళనకు దిగారు. పోలీసులు వారికి నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

లారీ ఢీకొని యువతీయువకుడు...



ఆనిమోల్, సంతోష్ (పాతచిత్రాలు)

గుమ్మిడిపూండి: కన్నియాకుమరి జిల్లా కల్‌కుళానికి చెందిన ఆనిమోల్ (22), తిరువణ్ణామలై సమీప కుమారపాళ్యానికి చెందిన సంతోష్ (22) చెన్నై రాయపేటలోని ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నారు. వీరు తమ స్నేహితులు పది మందితో కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, తిరుపతి జిల్లా తడ సమీపంలోని జలపాతానికి శనివారం వెళ్లారు. సాయంత్రం ద్విచక్ర వాహనాలపై తిరుగు ప్రయాణమయ్యారు. పెరువాయల్ వద్ద లారీ ఢీకొనడంతో అనిమోల్, సంతోష్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్నేహితులు పొన్నేరి ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి కిందపడి ప్రయాణికుడు...

గుమ్మిడిపూండి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తెనాలికి చెందిన శ్రీనివాసరావు (53) చెన్నై రావడానికి కాకినాడ నుంచి సర్కార్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కారు. బోగీలో మెట్లపై కూర్చుని ప్రయాణించడంతో గుమ్మిడిపూండి సమీప పెద్దికుప్పం వద్ద అదుపుతప్పి కిందపడ్డారు. తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. కొరుక్కుపేట రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పదంగా బాలుడు...



జనార్దనన్ (పాతచిత్రం)

వేళచ్చేరి: కడలూర్ జిల్లా బన్రుట్టి సమీప ఎలందపట్టుకు చెందిన శరవణన్, భువనేశ్వరి భార్యాభర్తలు. శరవణన్ కొన్ని నెలల క్రితం మృతి చెందడంతో భువనేశ్వరి తన కుమారుడు జనార్దనన్ (10)ను తన తల్లి వద్ద విడిచిపెట్టింది. బాలుడు అమ్మమ్మ ఇంట్లో ఉంటూ ప్రభుత్వ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం రాత్రి పక్కింట్లో ఆడుకోవడానికి వెళ్లి తిరిగిరాలేదు. బాలుడి మేనమామ వసంత్ పలు ప్రాంతాల్లో గాలించాడు. శనివారం తన పక్కన ఇల్లు అయిన శోభన నివాసంలో బాలుడు గొంతుకు గుడ్డ చుట్టుకుని విగతజీవిగా వేలాడుతూ కనిపించాడు. వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై నడువీరపట్టు పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువతి దుర్మరణం

ప్రేయసి మరణాన్ని జీర్ణించుకోలేక బస్సు కిందపడి యువకుడి ఆత్మహత్య



యోగేశ్వరన్, శబరీనా (పాతచిత్రాలు)

మహాబలిపురం, న్యూస్‌టుడే: చెంగల్పట్టు జిల్లా మధురాంతకం సమీప పూండి కడంబూర్ ప్రాంతానికి చెందిన సురేష్ కుమారుడు యోగేశ్వరన్ (23) పటాలం ప్రాంతంలోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో మూడో ఏడాది చదువుతున్నాడు. ఇతను, తన సహ విద్యార్థిని అయిన కూడలూర్ ప్రాంతానికి చెందిన ఏళుమలై కుమార్తె శబరీనా (20) ప్రేమించుకుంటున్నారు. శనివారం కళాశాలకు సెలవు కావడంతో ఇద్దరూ ద్విచక్ర వాహనంపై మహాబలిపురం వెళ్లారు. మధ్యాహ్నం మహాబలిపురం సమీపంలోని ఈస్ట్ కోస్ట్ రోడ్డులో వెళుతుండగా ఎదురుగా వచ్చిన ఇసుక లోడు లారీ వీరి వాహనాన్ని ఢీకొంది. యోగేశ్వరన్, శబరీనా కిందపడ్డారు. ఆ సమయంలో పుదుచ్చేరి వైపు వెళుతున్న ట్రాన్స్‌పోర్ట్ బస్సు శబరీనా తలపైకి ఎక్కడంతో కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతుండగా స్థానికులు ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. ప్రేయసి తన కళ్ల ఎదుటే మృతి చెందడాన్ని జీర్ణించుకోలేక యోగేశ్వరన్ ఆసుపత్రి నుంచి శబరీనా తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి ఆసుపత్రి బయటకు వచ్చి ఈసీఆర్‌లో కొద్ది దూరం పరుగెత్తి ఎదురుగా వచ్చిన ప్రభుత్వ బస్సు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రెండు ఘటనలపై పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాలను చెంగల్పట్టు ఆసుపత్రికి తరలించి దర్యాప్తు జరుపుతున్నారు.

ఐటీ ఉద్యోగిని బలవన్మరణం

మహాబలిపురం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన రామానుజం కుమార్తె కుముది కుష్మ (23) కేళంబాక్కం సమీప శిరుచ్చేరిలోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తోంది. ఏగాటూర్‌లోని ప్రైవేటు హాస్టల్‌లో తన సహోద్యోగులు ప్రీతి, హేమలత తదితరులతో కలిసి ఉంటోంది. శనివారం అర్ధరాత్రి వరకు గదిలో ఉన్న వారంతా మాట్లాడుకుంటూ కాలక్షేపం చేశారు. ఆదివారం వేకువజామున మంచినీళ్ల కోసం ప్రీతి నిద్రలేచి చూడగా కుముది కుష్మ ఫ్యానుకు ఉరేసుకుని విగతజీవిగా వేలాడుతుండటం చూసి భయంతో కేకలు వేసింది. వెంటనే హేమలత నిద్రలేచి విషయాన్ని హాస్టల్ నిర్వాహకుడు, పోలీసులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. కేళంబాక్కం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని తాంబరం ఆసుపత్రికి తరలించారు. తరువాత విషయాన్ని ఆమె తల్లిదండ్రులకు తెలియజేశారు. ప్రాథమిక దర్యాప్తులో.. మృతురాలు గత కొద్ది నెలలుగా ఓ యువకుడిని ప్రేమిస్తోందని, అతనితో ప్రతిరోజు గంటల కొద్దీ ఫోన్‌లో మాట్లాడేదని, ప్రేమ వ్యవహారమే బలవన్మరణానికి కారణమై ఉండొచ్చని భావిస్తున్నారు. దర్యాప్తు కొనసాగుతోంది.

షేర్ మార్కెట్‌లో నష్టపోయిన ఎల్ఐసీ ఏజెంట్...



వినోద్‌కుమార్ (పాతచిత్రం)

రెడ్‌హిల్స్: పూందమల్లి సమీప సెన్నీర్‌కుప్పానికి చెందిన వినోద్‌కుమార్ (33) ఎల్ఐసీ ఏజెంట్. ఇతను షేర్ మార్కెట్‌లో ఆన్‌లైన్ ట్రేడింగ్ చేశాడు. పలువురి నుంచి రూ.లక్షల్లో అప్పు తీసుకున్నాడు. ట్రేడింగ్‌లో రూ.కోటి వరకు నష్టపోయాడు. అప్పు ఇచ్చినవారు నిలదీయడంతో మనస్తాపానికి గురైన అతను శనివారం రాత్రి ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. పూందమల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, ఏడాదిన్నర వయసున్న కుమారుడు ఉన్నారు.



డ్రైనేజీలో గాలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది, రాజన్‌పొన్ని (పాతచిత్రం)

డ్రైనేజీలో విశ్రాంత సైనికాధికారి గల్లంతు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: తిరుప్పూర్ ఇడువంపాళ్యానికి చెందిన రాజన్‌పొన్ని (67) విశ్రాంత సైనిక అధికారి. ఈయన కోవైలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఏరోనాటికల్ విభాగంలో శిక్షకుడిగా పనిచేస్తున్నారు. తిరుప్పూర్ నుంచి ప్రతిరోజు రైల్లో కోవై వచ్చి వెళ్తుంటారు. ఈనెల 1న కళాశాలకు వెళ్లిన ఆయన తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబీకులు తిరుప్పూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు ఆయన కోసం గాలింపు చేపట్టారు. రైల్వేస్టేషన్ నుంచి రోజూ వెళ్లే మార్గంలోని సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలించారు. అందులో స్టేషన్ నుంచి కళాశాలకు వెళ్లే రోడ్డులో ఉన్న రైల్వే సబ్‌వే గుండా ఒకటో తేదీ రాజన్‌పొన్ని ద్విచక్ర వాహనంపై వెళ్తున్నట్లు ఉంది. కానీ, ఆ తర్వాత కెమెరాల్లో ఎటు వెళ్లింది నమోదు కాలేదు. దీంతో ఆ ప్రాంతంలోని డ్రైనేజీలో పడిపోయి ఉండవచ్చని భావించి శనివారం రాత్రి నుంచి తిరుప్పూర్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సాయంతో గాలించారు. రాయపురం వెళ్లే మార్గంలోని డ్రైనేజీలో ద్విచక్రవాహనాన్ని గుర్తించారు. అతని మృతదేహం కోసం గాలిస్తున్నారు. 1వ తేదీ తిరుప్పూర్‌లో కురిసిన భారీవర్షానికి రాజన్‌పొన్ని రైల్వేస్టేషన్ నుంచి ద్విచక్రవాహనాన్ని తీసుకొని ఇంటికి బయలుదేరాడని, సబ్‌వేలో నిలిచిన నీటిని దాటే క్రమంలో కొట్టుకుపోయి ఉండవచ్చని పోలీసులు తెలిపారు.

సంప్రదాయం తప్పితే చర్యలు

శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవో

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయ దర్శనార్థం వచ్చే భక్తులు సంప్రదాయ వస్త్రధారణ, తిలకధారణ ఇకపై విధిగా అమలు చేసేలా ఈవో చంద్రశేఖర్ ఆజాద్ ఆదేశించారు. భక్తులు పాటించేలా చర్యలు తీసుకోవాలని, అలా కాకుండా సంప్రదాయ వస్త్రధారణ లేకుండా దర్శనాలు, అభిషేకాలు, రాహు, కేతు పూజలకు అనుమతిస్తే సంబంధిత అధికారులపై చర్యలు కఠినతరంగా ఉంటాయని ఆదివారం ఇచ్చిన ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. స్వామి, అమ్మవార్లకు నిర్వహించే రాహు, కేతు పూజలు చేయించుకునే భక్తులు విధిగా సంప్రదాయ వస్త్రాలతో హాజరు కావాల్సి ఉందన్నారు. దీనిపై భక్తులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని, ఇందు కోసం ఇంజినీరింగ్ శాఖ ఆలయంతో పాటు పట్టణంలోని ప్రధాన కూడళ్లల్లో సూచికలు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ఆలయ ప్రవేశ ద్వారాలతో పాటు మహద్వారం వద్ద విభూదీ, కుంకుమ, చందనం అందుబాటులో ఉంచాలని, ప్రతి ఒక్కరూ వాళ్లకు ఇష్టమైన దాన్ని ధరించి ఆలయంలో స్వామి, అమ్మవార్లను దర్శనం చేసుకోవాలని సూచనలు చేశారు.

వారాంతర సెలవు మార్పు: ముక్కంటి ఆలయంలో ప్రస్తుతం కొనసాగుతున్న ఆదివారం వారాంతపు సెలవును మార్పు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆదివారం రద్దీ ఎక్కువగా ఉంటున్న నేపథ్యంలో ఉద్యోగులందరూ విధులకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. ఇక వారాంతపు సెలవులను కొంత మందికి మంగళవారం, మరికొంత మందికి బుధవారం ఇచ్చేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచనలు చేశారు.